సాక్షి నల్లగొండ


గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

బైక్ చోరీలతో పాటు చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు.
- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 586.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1,10,368 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 38,354 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,176 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 7,778 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: నిల్
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 12,354 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 17,388 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

మట్టి విగ్రహాలను పూజిద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ: మట్టితో తయారు చేసిన గణేశుడి విగ్రహాలు పూజిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర కోరారు. మట్టి విగ్రహాలనే పూజించాలి అనే నినాదంతో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారి శంకర్ బాబు, ఏఈ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపల్లెకూ నాణ్యమైన విద్యుత్ అందించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి విద్యుత్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఇటీవలే రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మరో రూ.47 కోట్ల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు నియోజకవర్గంలో అవసరమైన నిధులు మంజూచేయించాలని కోరారు. ఈ సమావేశంలో నల్లగొండ, దేవరకొండ డీ.ఈలు, నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏ.ఈలు పాల్గొన్నారు.

నల్లగొండ సీపీఓగా గూడ వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

నల్లగొండ: నల్లగొండ ముఖ్య ప్రణాళిక అధికారి(సీపీఓ)గా గూడ వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. యాదాద్రి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిగా పనిచేస్తున్న ఈయన నల్లగొండ జిల్లాకు బదిలీపై వచ్చారు. అంతకు ముందు ఈయన సూర్యాపేట సీపీఓగా కూడా పనిచేశారు.

ఏడు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల



దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 12,354 క్యూసెక్కులఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు బుధవారం ఏడు గేట్లను నాలుగు అడుగుల మేర పైకెత్తి దిగువకు 17,388 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 642.20 అడుగులుగా ఉంది. కాగా మూసీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదలను నిలిపి వేశారు. 4.46 టీఎంసీ పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యంగల మూసీ రిజర్వాయర్‌లో 3.74 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

సూర్యాపేట నుంచి తాటికల్ మీదుగా ఎక్స్‌ప్రెస్‌లు

నల్లగొండ రూరల్: సూర్యాపేట డిపో నుంచి నకిరేకల్ వయా తాటికల్–సూరారం–చందనపల్లి గ్రామాల మీదుగా నల్లగొండకు 4 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట నుంచి ఉదయం 5.30కు ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు తిరిగి నల్లగొండ నుంచి ఉదయం 5.40 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రతి గంటకు ఒక ఎక్స్‌ప్రెస్ నడుస్తుందని.. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఏడుగురు



డాక్టర్ మిర్యాల రమేష్



డాక్టర్ అనిల్ కుమార్



డాక్టర్ శ్రీధర్



డాక్టర్ కృష్ణ కౌండిన్య



పులిమామిడి పద్మ



కృష్ణకాంత్ నాయక్



గిరిప్రసాద్

సాక్షి నెట్‌వర్క్ : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఎంపికయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజిమెంట్ అధ్యాపకుడు మిర్యాల రమేష్, నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న ఎం.అనిల్, ఆర్.శ్రీధర్, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకుడి పని చేస్తున్న డాక్టర్ కృష్ణకౌండిన్య, కేతేపల్లి మండలం కాసనగోడు జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ, మిర్యాలగూడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయుడు కృష్ణకాంత్‌నాయక్, చివ్వెంల మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు గిరిప్రసాద్ ఉన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే కార్యక్రమంలో వీరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు, ప్రశంసా పత్రం పొందనున్నారు.

మాస్టార్లు 8లో ▶

‘ఓపెన్’ అడ్మిషన్ల గడువు పెంపు

నల్లగొండ రూరల్: బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు యూనివర్సిటీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త అంతటి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, డిగ్రీ సెకండియర్ ట్యూషన్ ఫీజును ఈనెలాఖరు లోగా, డిగ్రీ ఫస్ట్, సెకండ్ సెమిస్టర్ ఫీజును ఈ నెల 20లోగా చెల్లించాలని పేర్కొన్నారు. కొత్త అడ్మిషన్లకు ఆన్‌లైన్ అప్లికేషన్ తర్వాత స్టడీ సెంటర్లలో ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫై చేయించుకుని, అడ్మిషన్ ఫీజు చెల్లించి రశీదు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సర్టిఫికెట్ల జీరాక్స్, ఒక ఫొటోతో ఆయా కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 95331 01295, 78893 39180 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అడ్డగోలుగా దోచిపెట్టేలా!

ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించిన కొనుగోళ్ల కమిటీ

సాధారణంగా ఓ వస్తువు ధర కిరాణా దుకాణంలో రూ.వంద ఉంటే.. హోల్‌సేల్ దుకాణంలో రూ.90 ఉంటుంది. అదే సరఫరా చేసే ప్రాంతంలోనైతే రూ.80 ఉంటుంది. కానీ, హాస్టళ్లు, గురుకులాలకు సరుకుల ధరలను మాత్రం జిల్లా కొనుగోళ్ల కమిటీ (డీపీసీ) కిరాణ దుకాణాల్లో ఉండే రేటు కంటే ఎక్కువగా నిర్ణయించింది. పెద్ద మొత్తంలో సరుకులు కొనుగోలు చేయాలంటే ఎవరైనా హోల్‌సేల్‌లో కానీ, సరఫరా చేసే ప్రాంతంలోగానీ కొనుగోలు చేస్తారు. కానీ అధికారులు మాత్రం అడ్డగోలుగా ధరలు నిర్ణయించి కాంట్రాక్టర్లకు మేలు చేస్తున్నారు.

గురుకులాలు, హాస్టళ్ల టెండర్లలో గోల్‌మాల్

- కాంట్రాక్టర్లు, అధికారుల కుమ్మక్కు?
- అధికార పార్టీ నేత పైరవీతోనే నిర్ణయాలు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి



కిరాణ సామాన్ల ధరలు ఇలా .. (కిలోకు, రూపాయల్లో)

వస్తువు	హోల్‌సేల్ ధర	అధికారులు నిర్ణయించింది
పెసర పప్పు	110	121
మినప పప్పు	125	138
వేరుశనగ నూనె	142	175
సన్‌ఫ్లవర్ ఆయిల్	110	128
చక్కెర	41	50
ఇడ్లీ రవ్వ	41	46
ఉప్మా రవ్వ	42	45
అటుకులు	60	65
ఆవాలు	80	110
శనిగలు	90	108
గ్రీన్‌పీస్	100	120
పెసర్లు	110	120
ఉలవలు	100	115
బెల్లం	52	60
మిల్‌మేకర్	80	115
నువ్వులు	180	210
మురమరాలు	60	72
గరం మసాల (అరకిలో)	300	440
చికెన్ మసాల (అరకిలో)	300	440
మటన్ మసాలా (అరకిలో)	300	440

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, స్కూళ్లు, కాలేజీల హాస్టళ్లలోని విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరంలో భోజనంలో పెట్టే పప్పులు, నూనెలు, ఇతర కిరాణ సామాను ధరలను డీపీసీ అడ్డగోలుగా నిర్ణయించింది. జిల్లాలోని ముఖ్యమైన అధికారులు ఉన్న ఈ కమిటీ నిర్ణయించిన ధరలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో తక్కువ ధర ఉండగా, గురుకులాలు, హాస్టళ్లకు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఎక్కువ ధరలు ఇచ్చేలా నిర్ణయించడంపై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికా రుల నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడనుంది.

పప్పుపైనే నెలకు రూ.10 లక్షలకుపైగా..

సాధారణ ప్రజలు కిరాణషాపులో కిలో కందిపప్పు కొనుగోలు చేస్తే.. ధర రూ.160 ఉంటుంది. అదే హోల్‌సేల్ 50 కిలోల బస్తా కొంటే కిలో రూ.150 చొప్పునే పడుతోంది. ఇక హైదరాబాద్‌లోని బేగం బజార్‌లో కొనుగోలు చేస్తే మరింత తక్కువ ధరే పడుతుంది. కానీ, గురుకులాలు, హాస్టళ్లకు సరుకులు సరఫరా చేసేందుకు జిల్లా కొనుగోళ్ల కమిటీ (డీపీసీ) కాంట్రాక్టర్ చెల్లించే మొత్తం మాత్రం కిలోకు రూ.171గా నిర్ణయించింది. అంటే కిలో కంది పప్పుపై రూ.21 అదనంగా చెల్లిస్తుంది. జిల్లాలోని వివిధ హాస్టళ్లలో 50 వేల మందికిపైగా ఉన్న విద్యార్థులకు ఒక్కరోజు వండి పెట్టాలంటే కనీసంగా పది మందికి కిలో చొప్పున 5 వేల కిలోల కంది పప్పు కావాల్సిందే. 5 వేల కిలోల నంబర్ వన్ క్వాలిటీ కందిపప్పుకు మార్కెట్‌లో లభించే హోల్‌సేల్ ధర ప్రకారం రూ.7.5 లక్షలు అవుతుండగా, డీపీసీ నిర్ణయించిన ధర మాత్రం రూ.8.55 లక్షలు ఉంది. అంటే ఒక్క రోజు పిల్లలకు పప్పు వండి పెడితే కాంట్రాక్టర్‌కు అదనంగా రూ.1.05 లక్షలు చెల్లిస్తోందన్నమాట. ఇలా విద్యార్థులకు నెలలో పది రోజులు కంది పప్పు వండిపెడితే రూ.10.50 లక్షలు కాంట్రాక్టర్‌కు దోచిపెట్టేలా డీపీసీ నిర్ణయం తీసుకుందంటే ఏడాదిలో ఇంకెంత లబ్ధి చేకూరుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇదొక్కటే కాదు పెసర పప్పు, మినపపప్పు, శనగపప్పు, వేరుశనగ నూనె, సన్‌ఫ్లవర్ నూనె ఇలా మొత్తంగా 79 రకాల కిరాణా వస్తువుల్లో కాంట్రాక్టర్‌కు ఏడాది కాలంలో రూ.కోట్లలో దోచిపెట్టేలా నిర్ణయం తీసుకున్నారు.

అధికార పార్టీ నేత ఒత్తిడి మేరకేనా?

ఈ విషయంలో అధికార పార్టీకి చెందిన ఈ ముఖ్య నేత పైరవీ చేసినందునే ఈ ధరలు నిర్ణయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కిరాణసామాను సరఫరా చేసే సదరు కాంట్రాక్టర్ వెనుక ఆ ముఖ్య నేత ఉన్నట్లుగా తెలుస్తోంది. ముడుపుల బాగోతంలో ఆయన ఒత్తిడితోనే అధికారులు కాంట్రాక్టర్‌కు దోచిపెట్టేలా ఈ ధరలను నిర్ణయించినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

భారీగా దండుకున్నారు..!

ధరల నిర్ణయంలో పరస్పర సంప్రదింపులు, మార్కెట్‌లో ఉన్న ధరపై పెద్దగా చర్చించకుండా, పరిశీలించకుండానే నిర్ణయించినట్లు తెలుస్తోంది. వాస్తవంగా సంప్రదింపులు జరిపితే, పెద్ద ఎత్తున సరఫరా చేస్తారు కాబట్టి మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకే వచ్చేవి. కానీ కాంటాక్టర్లతో కుమ్మక్కైన కొందరు అధికారులు ఈ వ్యవహారంలో క్రియాశీలంగా వ్యవహరించి భారీగా దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉత్తమ గురువులు.. 130 మంది

- జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక
- నేడు నల్లగొండలో సన్మానం
- హాజరుకానున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ: జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ సేవలు అందిస్తున్న 130 మంది ఉపాధ్యాయులను జిల్లా విద్యా శాఖ జిల్లా స్థాయి ఉత్తమ గురువులుగా ఎంపిక చేసింది. ఉత్తమ బోధనతోపాటు ఇతర సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆదర్శంగా నిలిచినందుకు వీరు ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు.

మంత్రి చేతుల మీదుగా సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం నల్లగొండలోని గంధంవారిగూడెం రోడ్డులోని జీఎం ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా సన్మానించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితోపాటు ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు.

భూ సర్వేకు సహకరించాలి

- మాజీ మంత్రి జానారెడ్డి



మాట్లాడుతున్న జానారెడ్డి, పక్కన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నూతన భూ చట్టం అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద తిరుమలగి సాగర్ మండలంలో కొనసాగుతున్న సర్వేకు రైతులు సహరిస్తే మండలం రాష్ట్రానికే ఆదర్శంగా నిలువనుందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం తిరుమలగి సాగర్ మండలంలోని చింతలపాలెం పంచాయితీ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పైలెట్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం ఇతర రెవెన్యూ అధికారులతో కలిసి ఇప్పటి వరకు సర్వే జరుగుతున్న తీరు, ఎదురవుతున్న సమస్యలపై సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. సర్వేయర్లు ఉడాస్ నంబర్లు తీసివేసి సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు అనేక సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం తిరుమలగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. ఇక్కడ వచ్చిన నివేదిక ఆధారంగానే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నూతన భూ చట్టాన్ని అమలు చేస్తుందన్నారు. కుటుంబ, ఇతర వివాదాల్లో ఉన్న భూములను రెండో విడతగా సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారుల సమీక్ష అనంతరం జానారెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణానాయక్, నాయకులు తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, మేరావత్ మునినాయక్, చినరామయ్య, శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న వర్షిత్‌రెడ్డి, నేతలు

వేములపల్లి: వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో దాదాపుగా 800 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వందల ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి దెబ్బతిన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా చేసి ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం అందించాలన్నారు. సాగర్ ఎడమకాల్వ వెంట ఉన్న ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వమే మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హనుమంతరెడ్డి, నాయకులు చిల్లంచర్ల అభి, గాయం భరత్‌రెడ్డి, సీతారాంరెడ్డి, పెదమాం భరత్, పందిరి భాగ్యమ్మ, పెద్దబోయిన వెంకటేశ్వర్లు, శివశంకర్, నక్క శ్రీనివాస్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఈట మహేష్, బట్టు మహేష్, గంగరాజు, నాగరాజు, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌కు తగ్గిన వరద.. గేట్లు మూత

నాగార్జునసాగర్: సాగర్ జలాశయానికి ఎగువ నుంచి వచ్చే వరద తగ్గడంతో ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లను బుధవారం మూసివేశారు. ఈ ఏడాది మొదటగా ఆగస్టు 5వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సాగర్ క్రస్ట్‌గేట్లు ఎత్తి 200 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. అనంతరం ఆగస్టు 26వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు మరోమారు క్రస్ట్ గేట్లు ఎత్తి 286 టీఎంసీల నీటిని క్రస్ట్‌గేట్ల గుండా వదిలారు. ఎగువ నుంచి వరద తగ్గడంతో గేట్లను పూర్తిగా మూసివేశారు. సాగర్ జలాశయం గరిష్ట నీటిమట్టం 590 అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం నీటిమట్టం 586.70 అడుగులు (303.9495 టీఎంసీలు)గా ఉంది. ఎగువ నుంచి 1,83,563 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా.. విద్యుదుత్పాదన ద్వారా 29,557 క్యూసెక్కులు, కుడికాల్వకు 7,578 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీకి 1800, వరద కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

6 నుంచి వలంటీర్ల ఎంపిక

నల్లగొండ రూరల్: త్వరలో బెంగళూరులో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి ఈనెల 6వ తేదీ నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేస్తున్నట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీ యూనివర్సిటీ పరిధిలోని జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లోని ఎన్ఎస్ఎస్ యూనిట్ల నుంచి వలంటీర్ల ఎంపిక యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదుగురు చొప్పున బాలబాలికలను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు.

పంట నష్టంపై సర్వే

- వరద ప్రభావిత మండలాల్లో ప్రారంభం
- క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్న ఏఈఓలు
- 802 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా
- ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపిన జిల్లా వ్యవసాయ శాఖ
- మరో మూడు రోజుల్లో తుది నివేదిక పంపే అవకాశం



వేములపల్లి మండలం శెట్టిపాలెంలో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

నల్లగొండ అగ్రికల్చర్: నాలుగు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట వివరాలను వ్యవసాయ శాఖ సేకరిస్తోంది. చాలా చోట్ల చెరువులు, కుంటలు తెగి వరద పోటెత్తింది. దీంతో వరి, పత్తి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేథప్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పంట నష్టంపై ప్రాథమిక అంచనా వేసి నివేదిక పంపిన జిల్లా వ్యవసాయ శాఖ బుధవారం గ్రామాల వారీగా క్షేత్ర స్థాయిలో పంటనష్టంపై సర్వేకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో వరద ప్రభావిత తొమ్మిది మండలాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తూ నష్టం వివరాలు సేకరిస్తున్నారు. దీంట్లో భాగంగా దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తూ రైతు పేరు, పంట పేరు, ఎన్ని ఎకరాల్లో పంట నష్టం జరిగింది.. పెట్టుబడి ఎంత పెట్టాడు తదితర వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసుకుంటున్నారు. మరో మూడు రోజుల్లో ఈ సర్వేను పూర్తిచేసి ప్రభుత్వానికి తుది నివేదిక అందజేయనున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ తెలిపింది.

నష్టం తగ్గే అవకాశం

వర్షం ఆగి వరదలు తగ్గాక పంట నష్టం వివరాలు సేకరిస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. వరదలు తగ్గిన కారణంగా పంటచేలు, పొలాల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయని ఇప్పుడొచ్చి పరిశీలిస్తే ఏం తెలుస్తుందని రైతులు అంటున్నారు. ఈ కారణంగా వరిపంట నష్టం తగ్గే అవకాశం ఉండనుందని రైతులు వాపోతున్నారు. పత్తి చేల విషయంలోనూ కొంచెం వరకు నష్టం తగ్గే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా పంట నష్టం వివరాల సేకరణ పూర్తయ్యే వరకు వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా పర్యటించి తుది నివేదికను జిల్లా వ్యవసాయాధికారికి అందించనున్నారు.

ప్రాథమిక అంచనా ఇలా..

జిల్లాలో పలు మండలాల్లో 802 ఎకరాల్లో పత్తి, వరి, మిర్చి పంటలకు నష్టం వాటిల్లినట్టు జిల్లా వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని నివేదించింది. ముఖ్యంగా దామరచర్ల మాడ్గులపల్లి, వేములపల్లి, గుర్రంపోడు, పెద్దవూర, చందంపేట, శాలిగౌరారం, కేతేపల్లి, చందూరు మండలాల్లో 648 ఎకరాల్లో వరి పంటకు 151 ఎకరాల్లో పత్తి పంట, 3 ఎకరాల్లో మిర్చి పంటలకు వరద ముంపు కారణంగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. 429 మంది రైతులకు చెందిన వరి పంట 106 మందికి చెందిన పత్తి పంట, ముగ్గురు రైతులకు చెందిన మిర్చి పంట నష్టం జరిగినట్లు పేర్కొంది. అయితే ప్రస్తుతం వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం క్షేత్ర స్థాయిలో తిరుగుతూ పంటనష్టం వివరాలు సేకరిస్తున్నారు.

పూర్తి వివరాలు తెలియజేయండి



పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో ఏఈఓలు వివరాల సేకరిస్తున్నారు. వారికి రైతులు విధిగా పంటల వివరాలు, భూముల సర్వే నంబర్లు తదితర విషయాలను తెలియజేయాలి. త్వరలోనే తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

క్లుప్తంగా

బేసిక్ కంప్యూటర్స్‌లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద మూడు నెలల కాలపరిమితితో బేసిక్ కంప్యూటర్స్(డేటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కల్గి, ఇంటర్మీడియట్ విద్యార్హత కల్గి ఉండాలన్నారు. చదువు మధ్యలో మానేసిన వారు మాత్రం అర్హులు కాదని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో సెప్టెంబర్ 9న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరుకావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తామని అన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత ఉద్యోగం అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతకు ప్రాధాన్యత కల్పించబడుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు 9133908000, 9133908111, 9133908222 నంబర్లను సంప్రందించాలని సూచించారు.

అగ్రికల్చర్ డిప్లొమాలో గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ అందుకుంటున్న నిఖిత

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని కోతులాపురం గ్రామానికి చెందిన కురిమిద్దె గోపాల్, మంగమ్మ దంపతుల కుమార్తె నిఖిత ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి అగ్రికల్చర్ డిప్లొమాలో ఉత్తమ గ్రేడ్ సాధించింది. బుధవారం యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ బీజే రావు, వ్యవసాయశాఖ కార్యదర్శి, కమిషనర్ రఘునందన్‌రావు చేతుల మీదుగా నిఖిత గోల్డ్ మెడల్‌తో ప్రశంసా పత్రం అందుకుంది.

క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు

- రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

మిర్యాలగూడ టౌన్: క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారావు అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంప్‌లో గల ఇండోర్ స్టేడియంలో మోనెక్స్ సన్‌రైజ్ తెలంగాణ స్టేట్ 3వ మినీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 200మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. నవీన్, జిల్లా బ్యాడ్మింటన్ కోచ్ ఎం. రామకృష్ణ తదితరులున్నారు.

మాస్టార్లు

వృత్తిపట్ల అంకిత భావం.. విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలన్న ఆశయం వీరి సొంతం. మూతపడే దశలో ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుతూ.. వారిలో సృజనాత్మకతను గుర్తించి వినూత్న పద్ధతుల్లో బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు ఉపాధ్యాయులు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తూ ఉపాధ్యాయ వృత్తికే వీరు వన్నె తెస్తున్నారు. విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉంటూ.. వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల సేవలను గుర్తిస్తున్న ప్రభుత్వం పలువురిని రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక చేసింది. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు.



- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- వినూత్న పద్ధతుల్లో విద్యాబోధన
- విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులు
- ఉత్తమ అవార్డులతో సత్కరిస్తున్న ప్రభుత్వం

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ఆటపాటలతో చదువులు


డ్రాయింగ్ ద్వారా విద్యార్థులకు టీచింగ్ చేస్తున్న టీచర్

ఆలేరురూరల్ : ఆలేరు మండలం పటేల్‌గూడెం ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో గతంలో పది మంది విద్యార్థులు కూడా లేరు. ఈ పాఠశాల ఉపాధ్యాయురాలు జ్యోతిర్మయి వినూత్న విద్యాబోధనతో విద్యార్థుల సంఖ్యను 45 మందికి పెంచారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) ద్వారా డ్రాయింగ్, పెయింటింగ్, డాన్స్, ఆటలు, పాటలతో విద్యా బోధన చేస్తున్నారు. తల్లిదండ్రులకు పాఠశాలపై నమ్మకం కలిగేలా పేరెంట్స్ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి పూర్తి సమాచారాన్ని చేరవేస్తున్నారు. 2019లో స్కూల్ పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించి.. అందులో విద్యార్థుల పెయింటింగ్స్, ఆటలు, పాటలు, డ్రాయింగ్, సాంప్రదాయాల గురించి నాటకాలను అప్‌లోడ్ చేస్తున్నారు. తన సొంత డబ్బుతో స్కూల్‌కు రంగులు, విద్యార్థుకు కలర్స్, బుక్స్, బొమ్మలు, అందించి ఉత్సాహపరుస్తున్నారు. ఇంగ్లిష్ మోటివేషన్ కోసం బోధనోపకరణాలతో చిన్నచిన్న పదాలు నేర్పించి పిల్లలు ఆంగ్లంలో మాట్లాడే విధంగా ప్రోత్సహిస్తున్నారు.

వినూత్న బోధన


ప్రాక్టికల్స్ చేయిస్తున్న ఉపాధ్యాయుడు బాల్‌రాజు

డిండి : డిండి మండలం వావిల్‌కోల్ ప్రభుత్వ పాఠశాల 2012లో మూతపడుతున్న సమయంలో అదే ఏడాది డీఎస్సీలో నాన్ లోకల్ కేటగిరి కింద అక్కడికి వచ్చిన ఉపాధ్యాయుడు ముద్దాడ బాల్‌రాజు ఆ పాఠశాల రూపురేఖలను మర్చారు. తొమ్మిదేళ్లుగా వినూత్న విద్యా బోధనతో విద్యార్థుల సంఖ్య పెంచారు. తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారంతోపాటు తన సొంత డబ్బు వెచ్చించి విద్యార్థులకు టై, బెల్టులు, షూ అందజేసేవారు. ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డులు అందుకున్నారు. ఇటీవల ఆయన మరో పాఠశాలకు బదిలీ అయిన సందర్భంలో.. సార్ మా పాఠశాలను వదిలి వెళ్లొదంటూ విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

రెండు దశాబ్దాల బోధన అనుభవం

రామగిరి (నల్లగొండ): ఎన్జీ కళాశాలలో కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఆర్.శ్రీధర్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఎం.కాం, ఎంబీఏ, ఎంఎఫ్ఏ పూర్తిచేసి 2015లో కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. యూజీసీ నెట్, జేఆర్ఎఫ్ అర్హత పొందాడు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో అకాడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేశారు. రెండు దశాబ్దాల బోధన అనుభవం కలిగిన డాక్టర్ శ్రీధర్ వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 26 పరిశోధనా వ్యాసాలు, 7 పుస్తకాలను రచించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా శ్రీధర్ పర్యవేక్షణలో ప్రస్తుతం ఇద్దరు విద్యార్థులు పీహెచ్‌డీ చేస్తున్నారు. పరీక్షల విభాగం కంట్రోలర్‌గా, అకడమిక్ కోఆర్డినేటర్, తదితర బాధ్యతలు నిర్వహించారు.

విద్యార్థులకు మార్గనిర్దేశం

రామగిరి (నల్లగొండ): ఎన్జీ కళాశాలలో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. 2011లో డిగ్రీ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. డాక్టర్ రెడ్డీస్ లాబ్ విద్యార్థులకు కెమిస్ట్రీ బోధించడంతో పాటు ప్రాజెక్టులు తయారీలో మార్గనిర్దేశం చేశారు. పర్యావరణ సహిత రసాయనిక చర్యల అభివృద్ధికి కృషి చేశారు. కాలుష్య లేకుండా డ్రగ్ తయారుకి అవసరమైన 5 రసాయనిక చర్యలను తయారు చేశారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా 7 సంవత్సరాలు ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌గా పనిచేసి గ్రామాల్లో మూఢ నమ్మకాలు, బాల్య వివాహాల నిర్మూలన, వయోజన విద్యపై అవగాహన కల్పించారు. గ్రామాల్లోని యువకుల ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వివిధ కంపెనీల్లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పొందేలా కృషి చేశారు.

సేవకు గుర్తింపు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గణితశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుర్ర కృష్ణకాంత్‌నాయక్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎంపికయ్యారు. ఈయన ప్రధానంగా బడిబాట కార్యక్రమంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచారు. 2021–22లో 258 మంది విద్యార్థులు ఉండగా.. ఈయన కృషితో ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య 450 మందికి చేరింది. ఈయన హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ర్యాంగింగ్‌పై అవగాహన కల్పిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.


విద్యార్థులకు డిజిటల్ బోధన చేస్తున్న కృష్ణకాంత్‌నాయక్

విద్యార్థుల శ్రేయస్సే పరమావధిగా..


పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు లచ్చిరాంనాయక్

మర్రిగూడ : మర్రిగూడెం మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం నాయక్ విద్యార్థుల శ్రేయస్సే పరమావధిగా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఎక్కడ పనిచేసినా పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. 'మీ పిల్లల్ని మేం తీర్చి దిద్దుతాం.. మీరు పిల్లలను ప్రభుత్వ స్కూల్‌కు పంపిస్తారా..' అంటూ వినూత్న ప్రచారం నిర్వహించి విద్యార్థుల సంఖ్య పెంచుతున్నారు. గురుకుల, నవోదయ కోచింగ్ ఇస్తూ 11 ఏళ్లలో ఎంతో మంది విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించేలా పనిచేశారు. ఆయన చేసిన సేవలకు 2019లో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2020లో జిల్లాస్థాయి, 2022లో రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఈ సంవత్సరం జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం రాష్ట్రం నుంచి నామినేట్ అయ్యారు.

విద్యార్థుల సంఖ్యను పెంచుతూ..


యోగాసనాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి (ఫైల్)

పెద్దవూర : పెద్దవూర మండలం ఏనెమిదిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విశేష కృషి చేస్తున్నారు. 2015లో త్రిపురారం మండలం బాబుసాయిపేటలో పనిచేసే సమయంలో ఎనిమిది మంది విద్యార్థులున్న పాఠశాలను 80మంది విద్యార్థులు చేరేలా కృషి చేశారు. అంతకుముందు పనిచేసిన వేములపల్లి మండలం శెట్టిపాలెం పాఠశాలలో కూడా 65 మంది విద్యార్థుల నుంచి 108 మందికి చేరింది. ఆయన ఉత్తమ బోధనకు ఆకర్షితుడైన ఓ ప్రభుత్వ ఉద్యోగి పట్టుబట్టి వారి పిల్లలను అదే పాఠశాలలో చేర్పించడం గమనార్హం. నిడమనూరు మండలంలోని కుంటిగొర్లగూడెం పాఠశాలకు భవనం లేకున్నా చెట్లకింద చదువులు చెప్పి విద్యార్థులను తీర్చిదిద్దాడు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆయన నాటించిన మొక్కలు నేడు వృక్షాలుగా ఎదిగి పాఠశాలలో పచ్చదనం ఉట్టిపడుతోంది. ఆయన కృషికి పలు అవార్డులు వరించాయి. 2022లో అంతర్జాతీయ గ్లోబల్ టీచర్ అవార్డును పొందారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పుడమి అవార్డు, జాతీయ విద్యారత్న అవార్డు, తెలంగాణ ప్రతిభారత్న అవార్డు, మదర్‌థెరిస్సా ఉత్తమ సేవా పురస్కారంతో పాటు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఆయన పొందారు.

పారదర్శకతకు విశేష కృషి

నల్లగొండ రూరల్ : మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎం.రమేష్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడి అవార్డుకు ఎంపికయ్యారు. ఈయన కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్గా, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగాధిపతిగా, పరీక్షల నియంత్రణ అధికారిగా, హాస్టల్స్ డైరెక్టర్.. ప్రస్తుతం ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్సు సెల్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పరిశోధన పత్రాలు సమర్పించి, సెమినార్లు నిర్వహించారు. యూనివర్సిటీలో అధునాతన టెక్నాలజీ ద్వారా పరిశోధన, పారదర్శకమైన పరిపాలనకు విశేషమైన కృషి చేశారు.

రికార్డు స్థాయిలో విద్యార్థుల సంఖ్య పెంపు


ప్రయోగాత్మకంగా బోధిస్తున్న పద్మ (ఫైల్)

కేతేపల్లి : కేతేపల్లి మండల కాసనగోడు జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెచ్ఎం పులిమామిడి పద్మ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ఈమె 39 ఏళ్ల సర్వీసులో ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషిచేశారు. చివ్వెంల జెడ్పీహెచ్ఎస్‌లో పని చేస్తున్నప్పుడు విద్యార్థుల సంఖ్య 980కి పెంచి రికార్డు సృష్టించారు. దాతల సహకారం, ప్రభుత్వ నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. ఆట పాటలతో పాటు అర్థమయ్యేలా బోధిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఎందరో విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యేందుకు కృషి చేశారు. బాలికలకు చదువుతో పాటు కరాటే, నృత్యం తదితర అంశాలపై శిక్షణ ఇప్పించారు. ఈమె చేసిన సేవలకు గుర్తింపుగా రెండుసార్లు మండల, రెండుసార్లు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.

నిరంతరం సాహితీ సేవలో..

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన తెలుగు ఉపన్యాసకుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈయన 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా తన బోధనానుభవంతో ఎంతో మంది విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దడంతోపాటు కవిగా, రచయితగా అనేక రచనలు చేసి సాహితీరంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. అనేక పరిశోధక వ్యాసాలు రాశారు. పాఠ్యాంశ బోధనకు మాత్రమే పరిమితం కాకుండా సాహిత్య ప్రక్రియలపై విద్యార్థులకు చక్కని అవగాహన కల్పించడంతో పాటు పద్యం మర్మాన్ని తెలిపి, పద్యంపై విద్యార్థులకు ఆసక్తిని కలిగించడం ఆయన ప్రత్యేకత. విద్యార్థులు వకృత్వం, క్విజ్, వ్యాసరచన వంటి పోటీలను, తరగతి సెమినార్లను నిర్వహించడం, స్టడీ ప్రాజెక్టులు తయారు చేసేలా ప్రోత్సహిస్తుంటారు. వీరబ్రహ్మంగారి చరిత్ర, కృష్ణకౌండిన్య గీతాలు, సంగమేశ శతకం, సద్గురు సాయి అష్టకం, అభిరిపోరు, యక్షగాన సాహిత్యంలో కల్పితకథలు, కాలగీతం, నెరుసు, మెర మొదలైనవి కృష్ణకౌండిన్య రచనలలో ముఖ్యమైనవి. టీశాట్, మన టీవీ చానల్స్ ద్వారా గ్రూప్స్, లెక్చరర్, గురుకుల పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతోపాటు కళాశాల విద్యార్థులకు పోటీ పరీక్షలు, పీజీ ప్రవేశపరీక్షలపై అవగాహన కల్పిస్తుంటారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతోపాటు, రాష్ట్రస్థాయిలో పలు సాహితీసంస్థల పురస్కారాలను పొందారు.

ఎక్కడ పనిచేసినా వందశాతం ఉత్తీర్ణత


విద్యార్థులతో తయారు చేయించిన ప్రయోగాన్ని అప్పటి కలెక్టర్ వెంకట్రావ్‌కు వివరిస్తున్న ఉపాధ్యాయుడు గిరిప్రసాద్ (ఫైల్)

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా చిట్టిపోలు గిరిప్రసాద్ ఎంపికయ్యారు. ఈయన ప్రస్తుతం చివ్వెంల మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన చిట్టిపోలు గిరిప్రసాద్ 1996లో ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించాడు. 2002లో స్కూల్ అసిస్టెంట్ (సైన్స్)గా పదోన్నతి లభించింది. అప్పటి నుంచి విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కనబరిచేలా బోధిస్తున్నారు. ఆయన ఎక్కడ పని చేసినా పదో తరగతి ఫలితాల్లో జనరల్ సైన్స్ సబ్జెక్టులో విద్యార్థులంతా ఉత్తీర్ణులు కావాల్సిందే. సైన్స్‌పై ఆసక్తి పెరిగేలా ప్రయోగాలతో బోధించడం, సైన్స్‌ఫెర్ నిర్వహించడం ఈయన ప్రత్యేకత. ఏనుభాముల జెడ్పీహెచ్ఎస్‌లో పని చేసినప్పుడు ఇన్‌స్పైర్ మనక్‌లో జాతీయస్థాయిలో పాల్గొన్నారు. సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో కూడా పాల్గొన్నారు. మట్టి వినాయకులను తయారు చేయించి గ్రామాల్లో పంపిణీ చేస్తుంటాడు. సైన్స్ దినోత్సవంలో విద్యార్థుల చేతన ప్రయోగాలు చేయిస్తుంటారు. 2018లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2012లో మండలస్థాయిలో, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో అవార్డు అందుకున్నారు.

వర్షం నీటిలో పడి వృద్ధురాలి మృతి


ఐలమ్మ (ఫైల్)

అడ్డగూడూరు: వర్షం నీటిలో పడి వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మానాయుకుంట గ్రామానికి చెందిన బోడ ఐలమ్మ(80) తన మనవళ్లతో కలిసి నివసిస్తోంది. మంగళవారం రాత్రి భారీ వర్షం కురవగా.. ఐలమ్మ అర్ధరాత్రి మూత్రవిసర్జన కోసం బయటికి వెళ్లి వీధిలో ప్రవహిస్తున్న వర్షపు నీటిలో పడి మృతిచెందింది.

చెరువులోకి వెళ్లి.. విద్యుత్ సమస్య పరిష్కరించి..


అసిస్టెంట్ లైన్‌మెన్ నరేష్


ఇన్సులేటర్ వేస్తున్న అసిస్టెంట్ లైన్‌మెన్ నరేష్

నడిగూడెం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బృందావనపురానికి విద్యుత్ సరఫరా అయ్యే లైన్ నడిగూడెం చౌదరి చెరువులో నుంచి ఉన్నది. ఈ చెరువులోని స్తంభానికి ఉన్న ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో బృందావనపురం గ్రామ పంచాయతీకి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖకు చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ నరేష్ చెరువులో నుంచి ఈదుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కి కొత్త ఇన్సులేటర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారుడ. నరేష్‌ను విద్యుత్‌శాఖ సిబ్బందితో పాటు గ్రామస్తులు అభినందించారు.

కారు, ట్రాక్టర్ ఢీ.. ముగ్గురికి గాయాలు


ధ్వంసమైన ట్రాక్టర్

అనంతగిరి: కారు, ట్రాక్టర్ ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన అనంతగిరి మండలం శాంతినగర్ శివారులో బుధవారం జరిగింది. శాంతినగర్ నుంచి ఖమ్మం వైపు విజయవాడ–హైదరాబాద్ హైవే సర్వీస్ రోడ్డు నుంచి హైవే పైకి వస్తున్న ట్రాక్టర్‌ను కోదాడ నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ రెండు ముక్కలుగా విరిగిపోయింది. కారు ముందుభాగం పాడైపోయింది. ట్రాక్టర్ డ్రైవర్ షేక్ జానితో పాటు కారు డ్రైవర్ గోపి, కారులో ప్రయాణిస్తున్న పవన్‌కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వారిని ఖమ్మం తరలించారు. కారు యజమాని షేక్ ఫహీద్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ షేక్ జానిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

- 13 బైక్‌లు, 3.7తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, ఆభరణాలను చూపుతున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్: పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేయడంతో పాటు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం సూర్యాపేట ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామానికి చెందిన పోలేపాక రమేష్, అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన జీడి నరేష్ కొంతకాలంగా పార్కింగ్ చేసిన బైక్‌లతో పాటు ఒంటరి మహిళలపై దాడి చేసి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. బుధవారం ఉదయం తిరుమలగిరి ఎస్ఐ తన సిబ్బందితో తిరుమలగిరి ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. వీరిద్దరు సూర్యాపేట వైపు బైక్‌పై వెళ్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకొని విచారించగా బైక్‌లను చోరీ చేయడంతో పాటు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. పోలెపాక రమేష్‌పై కొడకండ్ల, తుంగతుర్తి, శాలిగౌరారం పోలీస్ స్టేషన్ల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడని, సూర్యాపేట టౌన్, సూర్యాపేట రూరల్, నకిరేకల్, జనగాం, తొర్రూర్, ఆత్మకూర్(ఎస్), కేతేపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో అతడిపై 16 కేసులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఇవే కాగా మరికొన్ని కేసులు అతడిపై ఉన్నట్లు పేర్కొన్నారు. జీడి నరేష్ తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రమేష్‌తో కలిసి చైన్ స్నాచింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. నిందితుల నుంచి 3.7తులాల బంగారం, 13 బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. వీరు కేతేపల్లి మండలం ఇనుపాముల సమీపంలో వంగూరు కృష్ణ, జిల్లెపల్లి నరేష్ వద్ద నాలుగు బైక్‌లు తనఖా పెట్టగా వాటిని కూడా స్వాధీనం చేసుకున్నామని, కృష్ణ, జిల్లేపల్లి నరేష్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన సీసీఎస్ సీఐ శివకుమార్, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, సీసీఎస్ ఎస్ఐ శ్రీకాంత్, తిరుమలగిరి ఎస్ఐ సురేష్, సీసీఎస్ సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ రవి పాల్గొన్నారు.

• తడిసిముద్దయిన ధ్రువపత్రాలు


సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో ఓ ఇంటి ముందు ఇటీవల వరదకు తడిసిన వివిధ ధ్రువపత్రాలను ఆరబెట్టుకున్న దృశ్యం - కోదాడ

పట్టుబడిన మద్యం ధ్వంసం

నేరేడుచర్ల: మండల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన సుమారు రూ.70వేల విలువైన మద్యం బాటిళ్లను బుధవారం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి లక్ష్మనాయక్, నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ మాట్లాడుతూ.. ఐడీ లిక్కర్ 18 లీటర్లు, ఐఎంఎఫ్ఎల్ 27 లీటర్లు, బీర్లు 87 లీటర్లు ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎక్సైజ్ ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తదితరులున్నారు.

పాలకవీడులో 42 కార్టన్ల మద్యం..

పాలకవీడు: మండల పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన మద్యం బాటిళ్లతో పాటు నాటుసారాను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్, స్థానిక పోలీసులు ధ్వంసం చేశారు. మొత్తం 42 కార్టన్ల లిక్కర్ బాటిళ్లను, 40 లీటర్ల సారా సీసాలను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు.